**విలేఖరులు కావలెను**

తెలుగు రాష్ట్రాలలో లక్షలాది మంది పాఠకుల అభిమానాన్ని చూరగొంటున్న 'సూర్య ప్రభా' ఈ-పేపర్‌లో పని చేయుటకు జిల్లా, నియోజకవర్గాలు, మండలాల వారీగా విలేఖరులు కావలెను. ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించగలరు.

ఫోన్ - 8985829417



# సూర్య ప్రభా

తెలుగు జాతీయ దిన పత్రిక

సంపుటి : 1 సంచిక: 352 | ఎడిటర్ : ఇ.సంజీవరెడ్డి | గురువారం, జూన్ 12 2025 | పేజీలు : 4


# తేల్చేసిన రేవంత్..!




## కొత్త మంత్రులకు శాఖలు ఇవే!!

### కేసీఆర్ కుటుంబమే తెలంగాణకు అసలైన శత్రువన్న సీఎం

ఢిల్లీ వేదికగా మంత్రుల శాఖల పై రేవంత్ స్పష్టత ఇచ్చారు. మూడు రోజులుగా రేవంత్ ఢిల్లీలో పార్టీ ముఖ్య నేతలతో మంత్రాంగం చేస్తున్నారు. రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ తరువాత చోటు చేసుకున్న పరిణామాలు.. పూర్తి స్థాయి ప్రక్షాళనతో పాటుగా.. స్థానిక సంస్థల వేళ కీలక అంశాల పైన చర్చలు జరుగుతున్నాయి. కులగణన విజయ వంతం కావటంతో ఆ వివరాలను రేవంత్ పార్టీ నేతలతో పంచుకుంటు న్నారు. ఇదే సమయంలో కవితకు కాంగ్రెస్ లోకి ఎంట్రీ లేదని తేల్చేసిన రేవంత్..కొత్త మంత్రుల శాఖల పైన అసలు విషయం వెల్లడించారు.

**మంత్రుల శాఖలు...** ముఖ్యమంత్రి రేవంత్ ఢిల్లీ పర్యటన కొనసాగు తోంది. మీడియా చిట్ చాట్ లో రేవంత్ పలు ఆసక్తి కర అంశాల పైన స్పందించారు. తన అభిప్రాయాలను వెల్లడించారు. కొత్తగా మంత్రులు అయిన ముగ్గురికీ తన వద్ద ఉన్న శాఖలనే కేటా యిస్తానని స్పష్టం చేసారు. సీనియర్ మంత్రుల శాఖల్లో ప్రస్తుతానికి మార్పులు లేవని చెప్పారు. ప్రస్తుతం తన వద్ద ఉన్న 11 శాఖల్లో కొన్నింటిని ముగ్గురు కొత్త మంత్రులకు ఇవ్వనున్నట్లు చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ వద్దే హెూం, మున్సిపల్, క్రీడలు, విద్యతో పాటు కీలకమైన 11 శాఖలు ఉన్నాయి. కాగా, కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన ముగ్గురు మంత్రుల శాఖల పైన ఇప్పటికే దాదాపు స్పష్టత వచ్చింది. ఈ రాత్రికి వీరికి శాఖల కేటాయింపు పైన అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉంది. తాను ఢిల్లీకి వచ్చింది కర్ణాటక, తెలంగాణలో సక్సెస్ అయిన కులగణన వివరాలు పంచుకోవటానికేనని వెల్లడించారు.

**వారికి నో ఎంట్రీ...** నేను అధికారంలో ఉన్నంత వరకూ కేసీఆర్ కుటుంబానికి కాంగ్రెస్ లో నో ఎంట్రీ అని రేవంత్ తేల్చి చెప్పారు. కేసీఆర్ కుటుంబ సభ్యులే తెలంగాణకు శత్రువులుగా పేర్కొన్నారు. కులగణన సమయంలో కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్, కిషన్ రెడ్డి అందరి నివాసాలకు ప్రత్యేకంగా వెళ్లి వివరాలు స్వీకరించాలని హైదరాబాద్ కలెక్టర్‌కు ప్రత్యేకంగా సూచించినట్లు తెలిపారు. కేసీఆర్, కేటీఆర్, కిషన్ రెడ్డి, హరీష్ రావు సర్వేలో వివరాలు పంచుకోలేదన్నారు. కాళేశ్వరంలో ఏం జరిగిం దో.. కాళేశ్వరంపై తనకు ఉన్న అభిప్రాయాలను రెండు మూడు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తా నని రేవంత్ పేర్కొన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి ఒక ప్రాజెక్టు కూడా తీసు కురాలేదని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధికి కిషన్ రెడ్డి ముందుకు వస్తే వారితో కలిసి వెళ్లేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.

**నేను సిద్ధం...** తెలంగాణ ప్రాజెక్టులపై కిషన్ రెడ్డితో సమీక్ష చేసేందుకు రెడీగా ఉన్నట్లు తెలిపారు. ఏ రోజైనా తెలంగాణ ప్రాజెక్టులపై కిషన్ రెడ్డి నివేదిక ఇచ్చారా కనీసం తెలంగాణకు ప్రాజెక్టు ఇవ్వాలని డిమాండ్ చేశారా అని ప్రశ్నించారు. నిర్మల సీతారామన్ చెన్నైకు మెట్రో తీసుకువెళ్లారని.. ప్రహ్లాద్ కర్ణాటకకు మెట్రో తీసుకెళ్లారని మరి తెలంగాణ నుంచి కేంద్రమంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి ఏమీ తీసుకురాలేదని మండిపడ్డారు. తెలంగాణలో ప్రతీ అభివృద్ధి కార్యక్రమానికి కిషన్ రెడ్డి అడ్డుగా ఉన్నారన్నారు.

తెలంగాణ మంత్రివర్గం విస్తరణలో సామాజిక న్యాయం పాటించా మని.. 55 శాతం మేరకు ఇప్పటికే పదవులు కేయించామన్నారు. నక్సలిజానికి అంతం ఉండదని.. సామాజిక సమానతలు ఉ న్నంతవరకు నక్సలిజం ఉంటుందని రేవంత్ కీలక వ్యాఖ్యలు చేసారు.




హైదరాబాద్ : మృగశిర కార్తితో రైతులు వానాకాలం సాగు పనులు మొదలు పెట్టారు. దుక్కులు దున్ని సాగుకు భుములు సిద్ధం చేసుకుని ఎరువులు, విత్తనా లు సమకూర్చుకుంటున్నారు. ఎన్నో ఆశలతో పునాస సాగుకు సిద్ధమైన రైతులకు ఈసారి నైరుతి కూడా ముందే ఆశలను పెంచింది. దాదాపు 16 ఏళ్ల తర్వాత రోహిణితో వర్షాలు మొదలయ్యాయి. కానీ ప్రభుత్వం పెట్టు బడి సాయం మాత్రం ప్రతిసారి ఆలస్యంగానే అందిస్తోంది. యాసంగిలో ప్రభుత్వం ఎకరం, రెండెకరాలు ఇలా విడుతల వారీగా డబ్బులు అం దించింది. ఈ సారి ఒకేసారి రైతులకు ఇవ్వాలని నిర్ణయించడంతో రైతుల కొంత ఉరటగా కలుగుతున్నా డబ్బులు జమ అయిన తర్వాత మంచి రోజు చూసి విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మంచి రోజు ఎప్పుడు వస్తుందని రైతులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం ఎకరానికి రూ. 5 వేలు రైతుబంధు పేరుతో అందించారు. ప్రస్తుతం ముగిసిన యాసంగి సీజన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ. 6 వేలు అందించింది. ఎన్ని కల్లో రెండు సీజన్లో కలిపి రూ. 15 వేలు రైతు ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఎకరానికి రూ. వెయ్యి మాత్రమే పెంచి అందించారు. జిల్లాలో యాసంగిలో 88,055 మంది రైతులకు రూ. 7.03 కోట్లు జమ చేశారు. ఐదు ఎకరాల వరకు మాత్రమే పంట పెట్టుబడి సాయం అం దించారు. దీంతో మిగతా వారిలో నిరాశ మిగిలింది. ఇప్పటికీ యాసంగిలో పూర్తిస్థాయిలో రైతు భరోసా ఇవ్వలేదనే విమర్శలు ఉన్నాయి. ఈ సారి వానకాలం సీజన్లో మళ్లీ ఎకరానికి రూ. 6వేలు మాత్రమే జమ చేస్తారని భావిస్తున్నారు. పెట్టుబడి సాయం లేక మళ్లీ రైతులు గత్యంతరం లేక వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు రైతులకు మే మొదటి వారంలోని పెట్టు బడి సాయం అందిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉండేదని, రైతులు వ్యాపా రుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండదనే అభిప్రాయం ఉన్నది.

**2.43 లక్షల ఎకరాల్లో వానాకాలం సాగు...** రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలంలో 2 లక్షల 43 వేల 783 ఎకరాల్లో వివిధ పంటల సాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఇందులో వరి 1 లక్షా 84 వేల 860 ఎకరాలు, పత్తి 49760 ఎకరాలు, పెసర 79 ఎకరాలు, కందులు 1155 ఎకరాలు, జొన్నలు 14, మొక్కజొన్న 1600 ఎకరాలు, ఇతర పంటలు 6,304 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేశారు. మండలాల వారీగా గంభీరావుపేటలో 19,330 ఎకరాలు, ఇల్లంతకుంటలో 38,470 ఎకరాలు, ముస్తాబాద్‌లో 25,250 ఎకరాలు, సిరిసిల్లలో 5,883 ఎకరాలు, తంగళ్లప ల్లిలో 22,031 ఎకరాలు, వీర్నపల్లిలో 8,792 ఎకరాలు, ఎల్లారెడ్డిపేటలో 21,130 ఎకరాలు, బోయినపల్లిలో 21,310 ఎకరాలు, చందుర్తిలో 21,610 ఎకరాలు, కోనరావుపేటలో 23,700 ఎకరాలు, రుద్రంగిలో 10,105 ఎకరాలు, వేములవాడ 10,578 ఎకరాలు, వేములవాడ రూరల్‌లో 15,614 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో వరి 1.84 లక్షల ఎకరాలు, పత్తి 49,760 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. పెసర 79 ఎకరాలు, కందులు 1,155 ఎకరాలు, మొక్కజొన్న 1,600 ఎకరాలు, జొన్నలు 14 ఎకరాలు, ఇతర పంటలు 6,304 ఎకరాలు సాగుకు సిద్ధమయ్యారు.

ఇందుకోసం జిల్లాలో రైతుల కోసం 56,568 క్వింటాళ్ల వరి విత్తనాలు, పెసర 4.08 క్వింటాళ్లు, మొక్కజొన్న 27.04 క్వింటాళ్లు పత్తి 1,28,650 ప్యాకెట్లు కందులు 122.5 క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని సిద్ధం చేశారు. వానా కాలం సాగులో ఎరువులు 56,060 మెట్రిక్ టన్నులు అవసరం అవుతా యని అంచనా వేశారు. ఇందులో యూరియా 25,370 మెట్రిక్ టన్నులు, డీఏపీ 3,460 మెట్రిక్‌టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 22,390 మెట్రిక్ టన్ను లు, ఎంవోపీ 4,115 మెట్రిక్ టన్నులు ఎస్‌ఎస్‌పీ 725 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అందుకు అనుగుణంగా సిద్ధం చేస్తున్నారు.




### కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు పూర్తి!

హైదరాబాద్ :ఉత్కంఠ నడుమ కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు పూర్తయ్యింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్ద ఉన్న శాఖల్లో ముఖ్యమైన హెూంశాఖ, విద్య, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలను అట్టిపెట్టుకుని మిగిలిన శాఖలను కేటాయించారు. జి.వివేక్ వెంకటస్వామికి క్రీడ, కార్మిక, న్యాయ శాఖలను కేటాయించారు. అడ్లూరి లక్ష్మణ్‌కు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖను ఇచ్చారు. ఇక వాకిటి శ్రీహరికి వాణిజ్యం, పశు సంవర్ధక శాఖలను కేటాయించారు.




# తెలంగాణకు గుడ్‌న్యూస్..

## కొత్త ఎయిర్‌పోర్ట్స్ అందుబాటులోకి వచ్చేస్తున్నాయ్.. ఎప్పుడంటే..?

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం వైమానిక రంగంలో సరికొత్త శకానికి నాంది పలుకుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన మేరకు.. వరంగల్ శివారులోని మామునూరు, ఆదిలాబాద్ శివారులోని శాంతినగర్‌లో రెండు కీలక విమానాశ్రయాలు 2027 చివరికల్లా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ మహత్తర ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన టెండర్లను ఈ ఏడాది చివరిలో ఆహ్వానించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తు తం శంషాబాద్ విమానాశ్రయం మాత్రమే అందుబాటులో ఉన్న నేప థ్యంలో.. ఈ రెండు కొత్త ఎయిర్‌పోర్టులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు, వా ణిజ్య కార్యకలాపాలకు, పర్యాటక రంగానికి గణనీయమైన ఊపునివ్వ నున్నాయి. వరంగల్‌లోని మామునూరు ప్రాంతానికి ఒక సుదీర్ఘ వైమానిక చరిత్ర ఉంది. నిజాం కాలంలో.. 1930లోనే నిర్మించబడిన ఈ విమానాశ్రయం 1981 వరకు సేవలందించింది. దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం, మామునూరు ఎయిర్‌పోర్టు విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధమైంది. 2023 జూలై 31న రాష్ట్ర మంత్రివర్గం ఈ కొత్త ఎయిర్‌పోర్టుకు అధికారికంగా ఆమోదముద్ర వేసింది. దీనిని బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుగా అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం కూడా పచ్చజెండా ఊపింది. విమానాశ్రయం పరిధిలో ఇప్పటికే 696 ఎకరాల భూమి అందుబాటులో ఉండగా, విస్తరణకు అవసరమైన అదనపు 253 ఎకరాల భూసేకరణకు తెలంగాణ ప్రభుత్వం రూ.205 కోట్లను కేటాయించి, పనులను వేగవంతం చేస్తోంది. విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక మరియు డిజైన్లను సిద్ధం చేయాలని రోడ్లు, భవనాల శాఖ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకి లేఖ రాసింది. ఉడాన్ పథకం కింద ఈ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించడం, దీని ప్రాముఖ్యతను మరింత పెంచుతుంది. ఇది అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణతో పాటు, దక్షిణ మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల ప్రజలకు కూడా ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడతాయి.

**ఆదిలాబాద్ విమానాశ్రయం.. దశాబ్దాల కల సాకారం...** ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటు కల కూడా చాలా కాలంగా ఉంది. స్వాతంత్ర్యానికి ముందే, 1930లో, నిజాం కాలంలోనే యుద్ధ విమానాలకు ఇంధనం నింపడానికి 369 ఎకరాల భూమిలో ఏరోడ్రోమ్‌ను స్థాపించిన చరిత్ర ఈ ప్రాంతానికి ఉంది. జిల్లా అభివృద్ధికి విమానాశ్రయం అవసరమని స్థానికులు దీర్ఘకాలంగా కోరుతున్నారు. వారి ఆకాంక్షలను నెరవేరుస్తూ, కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆదిలాబాద్‌లో పౌర విమానాశ్రయానికి అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు భారత వాయుసేన నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ లభించిందని ఇటీవల రాష్ట్ర మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈ విమానాశ్రయాన్ని పౌర విమానాలు, ఎయిర్ ఫోర్స్ విమానాల రాకపోకలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని వాయుసేన సూచించింది. ప్రస్తుతం రక్షణ శాఖ అధీనంలో ఉన్న 369 ఎకరాల భూమిని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగిస్తే.. ఇప్పట్లో అదనపు భూసేకరణ అవసరం ఉండకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ రెండు విమానాశ్రయాల నిర్మాణానికి ఒక్కోదానికి సుమారు రూ.500 నుంచి రూ.600 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఇందులో 80 శాతం ఖర్చును కేంద్రం, 20 శాతం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయి. ఈ విమానాశ్రయాల ఏర్పాటుతో తెలంగాణలో ప్రయాణ సమయం తగ్గుతుంది. ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయి. పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది.

స్థానికులకు కొత్త ఉద్యోగావకాశాలు లభించి, ప్రాంతీయ అసమానతలు తగ్గుతాయి. అంతే కాకుండా.. ఈ రెండు విమానాశ్రయాల సరిహద్దులోని ప్రాంతాల్లో భూములకు అధిక ధర పలుకుతాయి.

## పేదల ఆరోగ్య రక్ష... ముఖ్యమంత్రి సహాయనిధి ..

కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 127 - రంగారెడ్డి నగర్ డివిజన్ పంచశీల కాలనీ ప్రాంతానికి చెందిన మధుస్మిత జెన (25) కేరాఫ్ జెన సురేంద్ర కుమార్ ఆరోగ్య పరిస్థితి బాగాలేదని తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ వైద్య సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లబ్ధిదారులు మధుస్మిత జెన కు 1.40 లక్షల



రూపాయలను మంజూరు చేయించగా బుధవారం చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బాధితులకు కార్పొరేటర్ విజయశేఖర్ గౌడ్ చేతులమీదుగా బాధిత కుటుంబసభ్యులకు ఎల్వోసీ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... పేదల ఆరోగ్య రక్ష సీఎం సహాయనిధి అని, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూసేవారు ముఖ్యమంత్రి సహాయనిధిని వినియోగించుకోవాలన్నారు.

## గులాబీ దళపతికి మద్దతుగా కుత్బుల్లాపూర్ నుంచి భారీగా తరలిన బిఆర్ఎస్ సైన్యం....

కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పై కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన జస్టిస్ పీసీ గోష్ కమీషన్ విచారణకు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరవనున్న నేపథ్యంలో గులాబీ దళపతి మద్దతుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు, అభిమానులు భారీ





సంఖ్యలో బిఆర్కే భవన్ కు తరలివెళ్లగా, న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి బిఆర్కే భవన్ వరకు భారీ సంఖ్యలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ కి మద్దతుగా ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ కు చెందిన పలువురు కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎ . ఎమ్ . ఎస్ హై స్కూల్ ను ప్రారంభించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ...





కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)కుత్బుల్లాపూర్ నియోజకవర్గం125 డివిజన్ గాజులరామారం పరిధిలో పీపీ నగర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ రషీద్ కుమారుడు సయ్యద్ ఇమ్రాన్ నూతనంగా ఏర్పాటు చేసుకున్న ఎ . ఎమ్ . ఎస్ హై స్కూల్ ను ప్రారంభించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి . ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మ రెడ్డి, జై రామ్, శ్రీ లక్ష్మి వెంకటేశ్వరా స్వామి ఆలయ చైర్మన్ నరేందర్ రెడ్డి, డైరెక్టర్ బుచ్చి రెడ్డి, డివిజన్ అధ్యక్షులు ఎం. డి లాయక్, గణేష్ మరియు గఫ్ఫార్, అజయ్, అమీర్ అలీ పాల్గొన్నారు.




## ఆటలు ఆడకున్నా పతకాలు!



హైదరాబాద్ : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక వర్సిటీ(జేఎన్‌టీయూహెచ్) క్రీడా విభాగంలో జరిగిన అవినీతి ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఇద్దరు అధికారులు, పొరుగుసేవల సిబ్బంది అంతర్ వర్సిటీ క్రీడా పోటీల్లో ఆటలు ఆడకపోయినా పతకాలు, ధ్రువపత్రాలు ఇప్పిస్తామంటూ రూ.లక్షలు వసూలు చేశారంటూ కొందరు జేఎన్‌టీయూకు ఫిర్యాదులు చేశారు. దీనిపై విచారణకు ఏర్పాటైన కమిటీకి ఆరోపణలు వాస్తవమేనని ప్రాథమిక ఆధారాలు లభించాయి. దీంతో ఉన్నతాధికారులు ఆగ్రహించి నలుగురు పొరుగుసేవల సిబ్బందిపై వేటు వేశారు. లోతుగా విచారణ కొనసాగించి, అక్కడ పనిచేస్తున్న అధికారుల సహకారంపై నిజానిజాలు తేల్చనున్నారు.

**విద్యార్థినులకు పురుష శిక్షకులు**

జేఎన్‌టీయూ క్యాంపస్, అనుబంధ కళాశాలల నుంచి జట్లను ఎంపిక చేసిన అధికారులు వీరిని కొద్ది నెలల నుంచి ఇతర రాష్ట్రాల్లో వేర్వేరు వర్సిటీలకు తీసుకెళ్లారు. విద్యార్థినుల క్రీడా బృందాలకు మహిళా కోచ్‌లను కాకుండా ఇద్దరు పొరుగు సేవల సిబ్బందిని పంపించారు. బాక్సింగ్, రెజ్లింగ్‌కు ఎంపికైన విద్యార్థినులు.. పంజాబ్‌లోని గురుకాశీ వర్సిటీలో ఐదు నెలల జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ పోటీల్లో పాల్గొన్నారు. సౌత్‌జోన్ వాలీబాల్ విద్యార్థినీ, విద్యార్థులు యూనివర్సిటీ ఆఫ్ కేరళలో జరిగిన పోటీలకు హాజరయ్యారు. తమిళనాడు కేంద్రీయ వర్సిటీలో ఆరు నెలల క్రితం జరిగిన ఖోఖో సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్ మహిళ, పురుషుల జట్టు.. తమిళనాడులోని జెప్పియార్ వర్సిటీ పోటీల్లో పాల్గొన్నాయి. ఇందులో విద్యార్థినులతో పాటు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పంపించారు.

**మినరల్ వాటర్‌తో కార్లు కడిగించుకున్నారు!**

క్రీడా విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు అధికారుల ప్రవర్తనపై క్యాంపస్ విద్యార్థులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరి కొందరు వారి చేష్టలను లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఓ అధికారి తన కార్లను మినరల్ వాటర్‌తో కడగాలంటూ సిబ్బందికి హుకుం జారీ చేశారు. నలుగురు ఔట్ సోర్సింగ్ సిబ్బందితో వర్సిటీ, అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులకు ఫోన్లు చేయించారు. క్రీడా పోటీలకు ఎంపిక చేస్తాం.. ఖర్చవుతుంది అంటూ వారితో చెప్పించారు. పోటీల్లో పాల్గొనకుండానే ధ్రువపత్రాలు ఇస్తామంటూ రూ.వేలల్లో వసూలు చేయించారు.

## అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో..అకడమిక్ ఆడిట్




హైదరాబాద్ : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు.. ఆచార్యుల హాజరును పరిశీలించేందుకు అధికారులు కొత్త విధానాన్ని అమలుచేయనున్నారు. ప్రతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు బోధించేందుకు సరైన సంఖ్యలో ఆచార్యులు.. సహ ఆచార్యులు.. సిబ్బంది ఉన్నారా? లేదా? పరిశోధనలు నిర్వహించేందుకు ప్రయోగశాలలున్నాయా? అన్న అంశాలను ఆకస్మికంగా తనిఖీ చేయనున్నారు. 'అకడమిక్ ఆడిట్' పేరుతో కొంతమంది అధికారులను బృందంగా ఏర్పాటుచేయనున్నారు. ప్రత్యేక బృందం సభ్యులు కళాశాలల్లో పరిస్థితులను పరిశీలించనున్నారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి నిబంధనలు, జేఎన్‌టీయూ మార్గదర్శకాలు పాటించడం లేదని గుర్తించి నివేదికలు సమర్పించిన వెంటనే చర్యలు తీసుకోనున్నారు. విద్యార్థులు, ఆచార్యుల నిష్పత్తికి అనుగుణంగా బోధన సిబ్బంది లేకపోయినా.. నిర్ణీత సంఖ్యలో ప్రయోగశాలలు లేకున్నా యాజమాన్యాలకు తాఖీదులిచ్చి గడువులోగా ప్రమాణాలు పాటించాలంటూ హెచ్చరించనున్నారు.

**వరుస ఆరోపణలు... వేలిముద్రల ఆచార్యులు**

జేఎన్‌టీయూ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు తగిన సంఖ్యలో లేరని ఆరోపణలొస్తున్నాయి. ఫలానా కళాశాలలో ఫ్యాకల్టీ లేరని, ల్యాబ్‌లు లేవంటూ తల్లిదండ్రులు ఉపకులపతి, రిజిస్ట్రార్ కార్యాలయాలకు లేఖలు రాస్తున్నారు. జేఎన్‌టీయూ పరిధిలో 215 అనుబంధ గుర్తింపు కళాశాలలుండగా.. వాటిల్లో 3.50లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కొన్ని ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు బీటెక్, ఎంటెక్ పూర్తిచేసిన వారిని అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమిస్తున్నారు. మరికొన్ని కళాశాలలు ప్రొఫెసర్లను నియమించుకుని బయోమెట్రిక్ హాజరు వేయించుకుని పంపుతున్నారు. ఇంకొన్ని కళాశాలల్లో చాలామంది బోధనా సిబ్బంది లేకపోవడంతో కాగితాలపైనే ఆచార్యులను నియమించుకుంటున్నారు.

**కమ్యూనికేషన్ స్కిల్స్ లేవు..**

అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో 60శాతం మంది ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలు లేవని జేఎన్‌టీయూ అధికారులు గుర్తించారు. ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తైనా వారికి ఉద్యోగాలు రావడం లేదంటూ పలు అధ్యయనాల నేపథ్యంలో ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో బోధనా ప్రమాణాలపై దృష్టి సారించారు.క్యాంపస్ ఇంటర్వ్యూలలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు 30శాతంమంది కూడా ఎంపిక కావడం లేదని తెలుసుకున్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న జేఎన్‌టీయూ అధికారులు అకడమిక్ ఆడిట్ ద్వారా లోపాలు గుర్తించి వాటిని సవరించుకోవాలంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రెండు, మూడు నెలల గడువులోపు లోపాలను సవరించుకోకపోతే కఠినంగా చర్యలు చేపట్టనున్నారు. బోధనా ప్రమాణాలు పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని జేఎన్‌టీయూ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

## బాలాజీ సీతారాం స్వీట్ హౌస్ ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ...

కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బహదూర్ పల్లి చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యతిధిగా హాజరై బాలాజీ సీతారాం స్వీట్ హౌస్ ను ప్రారంభించారు..అనంతరం కూన శ్రీశైలం గౌడ్ స్వీట్ హౌస్ నిర్వాహకులను అభినందించారు..ఈ కార్యక్రమంలో షేక్






జాంగిర్, అనిఫ్ ఫాతీమ, సయ్యద్ ఖాజా మీయ,బోరరాం, కిషోర్, వైష్ణవ్,మహమ్మద్ తౌఫిక్, మహమ్మద్ రజాక్, మోటే శ్రీనివాస్, మహమ్మద్ షాకీర్, సూర్వి భారత్ గౌడ్,రామకృష్ణ రెడ్డి, అఖిల్ సాయి గౌడ్, హీరలాల్, మనోహర్, దినేష్ గార్లతో పాటు తదితరులు పాల్గొన్నారు..

## బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కొలన్ హన్మంత్ రెడ్డి..



కుత్బుల్లాపూర్ (సూర్య ప్రబా) తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధి పనులకు తోడ్పడాలని కోరిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి . ఈ కార్యక్రమంలో 126 డివిజన్ అధ్యక్షులు గణేష్, ఎన్ ఎం సి మైనారిటీ అధ్యక్షులు మహమ్మద్ అంజాద్ పాల్గొన్నారు.

## శెట్టిబలిజ కులం బీసీల్లో చేర్చాలంటూ ర్యాలీ... మద్దతుగా ఎమ్మెల్యే గాంధీ గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి..



కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రావుల శేషగిరి.శెట్టిబలిజ ఐక్యత రిజర్వేషన్ గురించి కూకట్పల్లి బృందావన్ అపార్ట్మెంట్స్ నుంచి ర్యాలీతో బయలుదేరిన ఎమ్మెల్యే గాంధీ, బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఈ కార్యక్రమంలో జిల్లా మోర్చా ఓబీసీ ఉపాధ్యక్షులు లక్కోజి మురళీకృష్ణ. సంఘం సభ్యులు గణపతి, భాస్కర్ , చెల్లుబోయిన ఏసుబాబు, గుబ్బల మనేశ్వరరావు, దొమ్మేటి శీను బాబు , విత్తనాల రామకృష్ణ, కుడుపూడి భాస్కర్, శీను , రామకృష్ణ , భాస్కర్ మరియు తదితర నాయకులు

## రైతు వేదిక.. నిర్వహణ సులువిక

కొత్తగూడెం: నిర్వహణ భారంగా మారుతోన్న రైతు వేదికలకు మంచి రోజులు రానున్నాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని రైతు వేదికలపై సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసి తద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఒక్కో దానిపై 5కిలోవాట్ల సౌర పలకలు అమర్చాలని నిర్ణయించింది. వీటి ద్వారా ఆయా రైతు వేదికల విద్యుత్తు అవసరాలు పోనూ ఒక్కోదాని నుంచి సుమారు రూ.25వేల వార్షికాదాయం పొందేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఉభయ జిల్లాల్లోని ఐదు వేదికలను పరిశీలించిన రెడ్కో అధికారులు వాటిపై సౌర పలకలు బిగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

**మార్కెట్ యార్డులు, రైతు బజార్లలోనూ..**రైతు వేదికలతో పాటు మార్కెట్ యార్డులు, రైతు బజార్లలోనూ సౌర విద్యుత్తు ఉత్పత్తి చేయాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు నిర్ణయించాయి. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తోన్న పీఎం కుసుమ్ పథకం కింద సౌర ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని మార్కెట్ యార్డులు, రైతు బజార్లలోనూ సౌర విద్యుదుత్పత్తికి బాటలు పడనున్నాయి. అయితే వీటికి సంబంధించిన విధివిధానాలు జిల్లాస్థాయి రెడ్కో అధికారులకు అందాల్సి ఉంది. ఉన్నతాధికారుల నుంచి మార్గదర్శకాలు అందితే సౌర ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు చేపడతామని రెడ్కో అధికారులు చెబుతున్నారు.

**నిర్మించారు.. నిర్వహణ మరిచారు..**రైతులను సమావేశపరిచి శాస్త్రవేత్తల ద్వారా శిక్షణ, సలహాలు, సూచనలు అందించేందుకు.. ఎరువులు, విత్తనాల పంపిణీకి 5వేల ఎకరాలకు ఒక్కటి చొప్పున ఖమ్మం జిల్లాలో 129, భద్రాద్రి జిల్లాలో 67 రైతు వేదికలు నిర్మించారు. కొన్నేళ్లుగా నిర్వహణ నిధులు అందకపోవటంతో వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈఓలు) వాటిని గాలికొదిలేస్తున్నారు.

సొంత ఆదాయం లేకపోవటం, ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో రైతు వేదికల లక్ష్యం నీరుగారిపోతోంది. సౌర పలకల ఏర్పాటుతో ఆదాయం సృష్టించాలనే ప్రభుత్వ తాజా నిర్ణయంతోనైనా వాటి నిర్వహణ సక్రమంగా సాగాలని అన్నదాతలు ఆకాంక్షిస్తున్నారు. **ఆదాయం ఇలా..**ఒక్కో రైతు వేదికపై 5కిలోవాట్ల సౌర పలకలు బిగిస్తే.. నెలకు 600 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని రెడ్కో అధికారులు చెబుతున్నారు.




## కాళేశ్వరం కమిషన్ ఎదుట ముగిసిన కేసీఆర్ విచారణ

హైదరాబాద్: బీఆర్కే భవన్‌లో కాళేశ్వరం కమిషన్ ఎదుట మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ విచారణ ముగిసింది. ఆయన్ను పీసీ ఘోష్ కమిషన్ సుమారు 50 నిమిషాల పాటు విచారించింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పలు ప్రశ్నలు సంధించింది. 115వ సాక్షిగా ఆయన్ను విచారించింది. విచారణ ముగిసిన అనంతరం కేసీఆర్ అభిమానులు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ బీఆర్కే భవన్ నుంచి కారులో బయలుదేరి వెళ్లారు. ఆయన వెంట హరీశ్‌రావు ఉన్నారు.

**ఆనకట్టల నిర్మాణంపై నిర్ణయం ఎవరిది.. ప్రశ్నించిన కమిషన్...** విచారణ సందర్భంగా కేసీఆర్‌ను కాళేశ్వరం కమిషన్ 18 ప్రశ్నలు అడిగింది. ఆనకట్టల నిర్మాణానికి ఎవరు నిర్ణయం తీసుకున్నారని ప్రశ్నించింది. ఈక్రమంలో కాళేశ్వరం రీఇంజినీరింగ్ గురించి కేసీఆర్ వివరించారు. ఆనకట్టల నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం ఉందా అని కమిషన్ ప్రశ్నించింది. క్యాబినెట్, ప్రభుత్వ ఆమోదంతోనే ఆనకట్టల నిర్మాణం జరిగిందని కేసీఆర్ బదులిచ్చారు. వ్యాప్కోస్ సిఫారసుల ప్రకారమే నిర్మాణం జరిగిందని.. అన్ని అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అన్ని అంశాలతో ఉన్న పుస్తకాన్ని కమిషన్‌కు అందజేశారు. కాళేశ్వరం కార్పొరేషన్ గురించి కమిషన్ ఆరా తీసింది. కొత్త రాష్ట్రంలో నిధులను దృష్టిలో ఉంచుకొని కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు కేసీఆర్ తెలిపారు. ప్రాజెక్టు వేగంగా పూర్తి చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. బ్యారేజీల్లో నీటి నిల్వ గురించి కేసీఆర్‌ను కమిషన్ అడిగింది. ఎంత నీరు నిల్వ చేయాలన్నది ఇంజినీర్లు చూసుకుంటారని కేసీఆర్ చెప్పారు. బ్యారేజీల నిర్మాణ స్థలం ఎంపిక, మార్పు సాంకేతికపరమైన అంశమన్నారు. నీటి లభ్యత దృష్టిలో ఉంచుకొని కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపారు. జీవో నంబర్ 45ను, ఆపరేషన్స్ అండ్ మెంటినెన్స్ బుక్‌ను కమిషన్‌కు అందజేశారు.




## ఎమ్మెల్యే కోసం యువకులు వీరంగం.. ఎందుకంటే..

నల్గొండ : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి రాకపోవడంతో ఆయన అభిమానులు తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనయ్యారు. ఆ క్రమంలో చండూరులో ఇద్దరు యువకులు వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుంటే.. తాము వాటర్ ట్యాంక్‌పై నుంచి దూకేస్తామంటూ వారు బెదిరించారు. దీంతో స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకుని.. వారిని కిందకు దింపేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు తనకు మంత్రి పదవి రాకపోవడంపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన ఎక్స్ ఖాతా వేదికగా బుధవారం స్పందించారు. కొత్తగా మంత్రి పదవులు పొందిన ఎమ్మెల్యేలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకీ ఆయన ఏమన్నారంటే.. తెలంగాణ కేబినెట్‌లో నూతనంగా నియమితులైన మంత్రులను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ప్రజలకు సేవ చేయడంలో వారికి సంపూర్ణ విజయం కోరుకుంటున్నాను. నాకు రాజకీయాలు అంటే పదవులు గానీ, అధికారాలు గానీ కాదు. ప్రజల పట్ల నా నిబద్ధత, తెలంగాణ పునర్నిర్మాణం పట్ల నా కలలే నాకు ప్రేరణగా నిలిచాయి. అదే కారణంగా నేనే తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చాను. ఈ రోజు నేను మంత్రిగా లేక పోయినా, పార్టీని బలపరిచే ప్రయత్నాల్లో, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతాను. ప్రజల సమస్యలు వినడంలో, వారి హక్కుల కోసం పోరాడడంలో, వారి గొంతుకను ప్రభుత్వం వరకు తీసుకెళ్లడంలో నేను ఎప్పటికీ ముందుంటాను. నా రాజకీయ ప్రయాణం ఇక్కడితో ఆగదు. కొన్నిసార్లు, పదవి లేకుండానే ప్రజల మధ్య పని చేసే అవకాశం ఎంతో శక్తివంతంగా మారుతుంది. అదే మార్గాన్ని నేను ఎంచుకున్నానన్నారు.

**ఇంతకీ ఏమైందంటే..** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తన కేబినెట్‌ను ఇటీవల పునర్వ్యవస్థీకరించారు. ఈ నేపథ్యంలో ముగ్గురు కొత్త వారికి ఆ కేబినెట్‌లో చోటు కల్పించారు. అయితే ఈ కేబినెట్‌లో తమకు చోటు దక్కుతోందంటూ పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు ఆశించారు. కానీ వారికి చోటు దక్కలేదు. ఈ నేపథ్యంలో వారంతా తీవ్ర నిరాశ చెందారు. ఆ క్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్‌తోపాటు మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు.. సదరు ఆశావాహుల ఇళ్లకు వెళ్లి బుజ్జగించిన సంగతి తెలిసిందే. ఇక ఈ జాబితాలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సైతం ఉన్నారు. ఆయన కూడా తీవ్ర నిరాశకు గురయ్యారు. ఆయన్ని సైతం పార్టీ పెద్దలు బుజ్జగించినట్లు సమాచారం.

అదీకాక రేవంత్ రెడ్డి కేబినెట్‌లో పలువురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారు. ఈ నేపథ్యంలో సామాజిక వర్గాల సమీకరణాల దృష్ట్యా వివిధ వర్గాల వారికి ఈ కేబినెట్‌లో చోటు కల్పించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించింది. అందులోభాగంగా వివిధ సామాజిక వర్గాలకు చెందిన ముగ్గురికి కేబినెట్‌లో చోటు కల్పించింది. ఇంకోవైపు రేవంత్ రెడ్డి కేబినెట్‌లో మరో మూడు మంత్రి పదవులను భర్తీ చేయాల్సి ఉంది. వాటిని భవిష్యత్తులో భర్తీ చేసే అవకాశముందని పార్టీ వర్గాల్లో ఒక చర్చ అయితే నడుస్తోంది.




దిల్లీ: తాను ఉన్నంత వరకు కాంగ్రెస్‌లోకి మాజీ సీఎం కేసీఆర్ కుటుంబానికి ఎంట్రీ లేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రానికి ఆ కుటుంబమే ప్రధాన శత్రువని మండిపడ్డారు. దిల్లీలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం మాట్లాడారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణ, శాఖల కేటాయింపుపై దిల్లీలో ఎలాంటి చర్చ జరగలేదని సీఎం చెప్పారు. హైదరాబాద్ వచ్చాక అందరితో సంప్రదించి శాఖలు నిర్ణయిస్తామని తెలిపారు. కర్ణాటక కులగణనపై మాత్రమే అధిష్ఠానం వద్ద చర్చలు జరిగాయన్నారు. కాళేశ్వరంపై రెండు రోజుల్లో మీడియా సమావేశం నిర్వహిస్తానని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. కాళేశ్వరం డాక్యుమెంట్లు అన్నింటినీ బయటపెడతానన్నారు. తెలంగాణకు సంబంధించి కేంద్రంలో అన్నింటికీ అడ్డుపడుతోంది కిషన్‌రెడ్డేనని ఆరోపించారు. రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రాజెక్టుకూ ఆయన నిధులు సాధించలేదని విమర్శించారు.

## ప్రాజెక్టుల పేరుతో పింక్ వ్యవస్థను బలోపేతం చేసుకున్నారు

ములుగు: గత భారాస ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం, ధరణి, మిషన్ భగీరథ పథకాలు పెద్ద స్కామ్ అని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు.

ములుగులో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ... గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రాజెక్టుల పేరుతో పింక్ వ్యవస్థను బలోపేతం చేసుకున్నారని ధ్వజమెత్తారు. జాతిపితగా ప్రకటించుకునే వ్యక్తి దర్యాప్తు సంస్థ ముందు విచారణకు వచ్చారని, ఎంతటి వారైనా తప్పు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.





## ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని పరామర్శించిన కేసీఆర్

హైదరాబాద్: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పరామర్శించారు. కాలు జారి కిందపడటంతో గాయపడి సోమాజీగూడ యశోద ఆసుపత్రిలో పల్లా చికిత్స పొందుతున్నారు. భారాస నేతలతో కలిసి యశోద ఆసుపత్రికి వెళ్లిన కేసీఆర్.. పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, పలువురు భారాస నేతలు పల్లాను పరామర్శించిన వారిలో ఉన్నారు.


## అలా చేస్తే ఎంతటి వారినైనా వదలం.. పోలీస్ శాఖ హెచ్చరిక




హైదరాబాద్, జూన్ 11: చేవెళ్లలోని త్రిపుర రిసార్ట్‌పై పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. ఈ రిసార్ట్‌లో ఫోక్ సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీ నిర్వహిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటక కూడా పెద్దఎత్తున డీజే శబ్దాలు రావడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు రిసార్ట్‌పై ఒక్కసారిగా మెరుపు దాడి చేశారు. ఈ క్రమంలో పార్టీలో పెద్దఎత్తున విదేశీ లిక్కర్ పట్టుబడింది. అంతేకాకుండా గంజాయి సేవిస్తూ ఓ వ్యక్తి పోలీసులకు చిక్కాడు. మంగ్లీ తీరుపై సీరియస్ అయిన పోలీసులు ట్వీట్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారిపై అయినా చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు.

**పోలీసుల ట్వీట్....** 'అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న రిసార్ట్‌పై చేవెళ్ల పోలీసులు దాడి చేశారు. చట్టాలు పాటించకుండా ఎలా పడితే అలా వ్యతిరేకంగా వ్యవహరిస్తామంటే పోలీసులు ఝులిపించి గాడినపెట్టాల్సి వస్తుంది. ఎంతటి ప్రముఖులైనా డ్రగ్స్ లాంటి వాటిని వాడే వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడం' అంటూ తెలంగాణ పోలీసు శాఖ ట్వీట్ చేసింది. కాగా.. సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీలో గంజాయి కలకలం రేపింది. చేవెళ్లలోని త్రిపుర రిసార్ట్‌లో నిన్న (మంగళవారం) రాత్రి సింగర్ మంగ్లీ పుట్టిన రోజు పార్టీని నిర్వహించారు. ఈ పార్టీకి సెలబ్రిటీలు దివి, కాసర్ల శ్యామ్, జబర్దస్త్ రవి, సింగర్ ఇంద్రావతి హాజరయ్యారు. అయితే ఎంతో ఉల్లాసంగా జరుగుతున్న బర్త్‌వేడుకల్లో పోలీసులు ఎంట్రీ ఇచ్చి షాకిచ్చారు. రిసార్ట్ నుంచి పెద్ద శబ్దాలు రావడంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో చేవెళ్ల పోలీసులు రిసార్ట్‌పై దాడి చేశారు. త్రిపుర రిసార్ట్‌లో విపరీతమైన సౌండ్ పొల్యూషన్‌తో మంగ్లీ పార్టీ నిర్వహించింది. పార్టీకి వచ్చిన ఫ్రెండ్స్‌కు మంగ్లీ లిక్కర్ సరఫరా చేయించింది. పార్టీ కోసం పెద్దఎత్తున విదేశీ లిక్కర్‌ను తెప్పించారు. పార్టీకి అటెండ్ అయిన ఓ వ్యక్తికి గంజాయి పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది. రైడ్ చేసే సమయంలో రిసార్ట్‌లో మంగ్లీకి సంబంధించిన 50మంది సన్నిహితులు ఉన్నారు. మొత్తం 48 మందికి పోలీసులు డ్రగ్స్ టెస్ట్ చేశారు. టెస్ట్ సమయంలో పార్టీలో పాల్గొన్నవారు పోలీసులను ముప్పు తిప్పలు పెట్టారు. డ్రగ్ పరీక్షల సమయంలో పోలీసులతో మంగ్లీ స్నేహితురాలు దివి ర్యాష్‌గా బిహేవ్ చేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా సోదాలు జరపడానికి వచ్చిన పోలీసులపై సింగర్ మంగ్లీ వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. పార్టీకి ఎలాంటి అనుమతి లేదని పోలీసులు చెబుతున్నా సరే.. సింగర్ మంగ్లీ వారిపై దురుసుగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బర్త్‌డే రోజే మంగ్లీపై చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది.

## గ్రూప్-1 నియామకాలపై స్టే ఎత్తివేయాలని హైకోర్టులో 4 పిటిషన్లు



హైదరాబాద్: తెలంగాణలో గ్రూప్-1 నియామకాలపై స్టే ఎత్తివేయాలని కోరుతూ హైకోర్టులో నాలుగు పిటిషన్లు దాఖలయ్యాయి. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షా కేంద్రాల కేటాయింపు, మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని పలువురు అభ్యర్థులు గతంలో హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. గత నెలలోనే ఈ పిటిషన్లపై వాదనలు జరిగాయి. పునర్‌మూల్యాంకనం చేయాలని లేదా మరోసారి మెయిన్స్ నిర్వహించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోరారు. అభ్యర్థులు కేవలం అపోహపడుతున్నారని, నిపుణులతో మెయిన్స్ పత్రాల మూల్యాంకనం చేయించామని టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గ్రూప్-1 నియామకాలు ఆలస్యమైతే ఎంపికైన అభ్యర్థులు నష్టపోతారని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయస్థానం గ్రూప్-1 నియామకాలపై స్టే విధించింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చని ఆదేశించింది. గ్రూప్-1 నియామకాలపై విధించిన స్టేను ఎత్తివేయాలని కోరుతూ గ్రూప్-1కు ఎంపికైన నలుగురు అభ్యర్థులు ఉన్నత న్యాయస్థానంలో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ రోజు విచారణ సందర్భంగా స్టే వెకెట్ పిటిషన్లపై వాదనలు జరిగాయి. కౌంటరు దాఖలు చేయడానికి టీజీపీఎస్సీ, ఇతర న్యాయవాదులు సమయం కోరారు. విచారణను ఆలస్యం చేయొద్దని, దీని వల్ల ఎంపికైన అభ్యర్థులకు ఇబ్బందులు ఉంటాయని హైకోర్టు తెలిపింది. వినిపించిన వాదనలే మళ్లీ వినిపించొద్దని, ఈనెల 30న పూర్తి స్థాయి వాదనలు వింటామని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

## మోదీ ఇచ్చిన హామీల పరిష్కారానికి డేట్ చెప్పాలి: తమ్మినేని వీరభద్రం




హైదరాబాద్: ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న హత్యాకాండను తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆపరేషన్ కగార్ నిలిపివేయాలంటూ శాంతిచర్చల కమిటీ హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించింది. కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ... దేశంలో పేదరికాన్ని తొలగిస్తే వామపక్ష ఉగ్రవాదం ఉండదన్నారు. "మావోయిస్టులను 2026 మార్చి 31 నాటికి అంతం చేస్తామని ప్రకటిస్తున్నారు. నరేంద్రమోదీ ఇచ్చిన హామీల పరిష్కారానికి డేట్ చెప్పాలి. శాంతి చర్చల కమిటీ 17న చేపట్టే మహాధర్నాను పార్టీలకు అతీతంగా విజయవంతం చేయాలి" అని కోరారు. కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే అనిల్ కుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, జస్టిస్ చంద్రకుమార్, చెరుకు సుధాకర్, వామపక్ష పార్టీల నేతలు సమావేశంలో పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను అర్థం చేసుకునేందుకు కాంగ్రెస్ నేతలకు జీవితకాలం చాలదు: కేటీఆర్




హైదరాబాద్: మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ జీవితం ఒక చరిత్రగా నిలిచిపోతుందని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. 60 ఏళ్లలో జరగని పనులను కేసీఆర్ విజయవంతంగా పూర్తి చేశారని పేర్కొన్నారు. కేవలం తెలంగాణ కోసమే ఆయన పనిచేశారని చెప్పారు. కాళేశ్వరం ద్వారా కరవుకు పరిష్కారం చూపించారని వివరించారు. కేసీఆర్‌ను అర్థం చేసుకునేందుకు కాంగ్రెస్ నేతలకు జీవితకాలం చాలదన్నారు. కాళేశ్వరం కమిషన్ ముందు కేసీఆర్ మరికాసేపట్లో హాజరు కానున్నారు. బీఆర్కే భవన్‌లో విచారణకు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ 'ఎక్స్'లో తాజాగా పోస్టు చేశారు.

**చేవెళ్ల గ్రామీణం: సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీలో విదేశీ మద్యం, గంజాయి లభ్యమయ్యాయి. పుట్టినరోజు సందర్భంగా రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఈర్లపల్లి శివారులోని రిసార్టులో స్నేహితులకు మంగళవారం రాత్రి ఆమె పార్టీ ఇచ్చారు. ఈ వేడుకలకు సుమారు 50 మంది వరకు మంగ్లీ కుటుంబ సభ్యులు, స్నేహితులు హాజరయ్యారు. వీరిలో సినీ పరిశ్రమకు చెందిన వారు కూడా ఉన్నట్లు సమాచారం. ఈక్రమంలో రాత్రి 2 గంటల సమయంలో ఎస్‌వోటీ పోలీసులు రిసార్టుపై దాడులు చేశారు. పార్టీకి వచ్చిన వారిలో 48 మందికి గంజాయి పరీక్షలు నిర్వహించగా 9 మందికి పాజిటివ్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో వారిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.**



## చెనాబ్ రైల్వే బ్రిడ్జ్ విజయంపై తొలిసారి స్పందించిన ప్రొఫెసర్ డా. జి. మాధవి లత

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన చెనాబ్ రైల్వే వంతెనను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్ విజయం వెనుక సామూహిక కృషి ఉందని, వ్యక్తిగత ప్రచారం తగదని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ డా. జి. మాధవి లత స్పష్టం చేశారు. చెనాబ్ రైల్వే బ్రిడ్జ్ నిర్మాణం భారత దేశానికి గర్వకారణమైన ఘనత అని డా. మాధవి లత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత రైల్వేలు, AFCONS సంస్థల అద్భుతమైన ప్రణాళిక, రూపకల్పన, నిర్మాణ నైపుణ్యానికి ఈ బ్రిడ్జ్ నిదర్శనమని ఆమె కొనియాడారు. ఈ చారిత్రాత్మక ప్రాజెక్ట్ విజయవంతమవడానికి వందలాది మంది నిపుణులు, కార్మికులు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు అనేక రకాలుగా కృషి చేశారని, వారందరూ నిజమైన గుండెచప్పుడు లేని వీరులని ఆమె అభివర్ణించారు. ఈ ప్రాజెక్టులో



AFCONS కు జియోటెక్నికల్ కన్సల్టెంట్‌గా తాను స్లోప్ స్టెబిలైజేషన్, ఫౌండేషన్స్ రూపకల్పనలో సహకరించినట్లు డా. మాధవి లత తెలిపారు. అయితే "ఈ మిషన్ వెనుక ఉన్న మహిళ", "అసాధ్యాన్ని సాధ్యమైంది చేసింది", "వింతలు చేసింది" అంటూ కొంత మీడియా చేసిన వ్యాఖ్యలు అసత్యమని ఆమె స్పష్టం చేశారు.

ఈ ప్రాజెక్టుకు వేల మంది శ్రమించారని, ఒకరి కృషిని మాత్రమే ప్రముఖంగా చూపడం తగదని ఆమె అన్నారు. అనేక తండ్రులు తమ కూతుళ్లు ఆమెలాంటి వారిగా ఎదగాలని చెప్పడం, చిన్నపిల్లలు సివిల్ ఇంజనీరింగ్‌లో భవిష్యత్తు చూడాలని అనుకుంటున్నామని రాయడం తనకు ఎంతో ఆనందం కలిగించిందని, ఇది తన జీవితానికి గర్వకారణమని ఆమె తెలిపారు. తనపై ప్రేమను, అభినందనలను వ్యక్తం చేసిన ప్రతి భారతీయుడికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, తాను కూడా ఈ బ్రిడ్జ్ నిర్మాణానికి కృషి చేసిన వందలాది మందిలో ఒకరినే కాబట్టి తన పేరు మాత్రమే ప్రముఖంగా చూపించవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం స్పెయిన్‌లోని ఓ సదస్సులో పాల్గొంటున్నానని, తన వ్యక్తిగతతను గౌరవించమని ఆమె కోరారు. ఈ గొప్ప ఘనత మొత్తం భారత రైల్వేలదే అని ఆమె తన ప్రకటనను ముగించారు.

# అమెరికాలో ట్రంప్ ట్రావెల్ బ్యాన్ అమలు.. ఎయిర్ పోర్టుల్లో ప్రయాణికులకు నరకం





అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్ సహా 12 దేశాల పౌరులపై విధించిన ప్రయాణ నిషేధం (ట్రావెల్ బ్యాన్) అమల్లోకి వచ్చింది. ఈ నిషేధం కారణంగా అమెరికాలోని విమానాశ్రయాల్లో చాలా మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిషేధిత దేశాల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి వస్తున్న వారిని కూడా అమెరికా అధికారులు మరింత క్షుణ్ణంగా ప్రశ్నిస్తున్నారు. ఈ పరిణామం అమెరికాకు ప్రయాణించాలనుకుంటున్న వారికి ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే చెల్లుబాటయ్యే వీసాలు ఉన్న ప్రయాణికులు కూడా విమానాశ్రయాల్లో విస్తృతమైన తనిఖీలను ఎదుర్కొంటున్నారు.

**-గ్వాటెమాలన్ దంపతుల అనుభవం:** ఈ సోమవారం గ్వాటెమాల పౌరులు విన్సెంటా అగ్యిలార్, ఆమె భర్త మయామి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. వారికి గత వారం టూరిస్ట్ వీసాలు మంజూరయ్యాయి. అయితే విమానాశ్రయంలో అమెరికా అధికారులు వారిని మూడు వేర్వేరు ఇంటర్వ్యూలు చేశారు. ఈ అనుభవం తమను ఆందోళనకు గురిచేసిందని విన్సెంటా అగ్యిలార్ మీడియాకు తెలిపారు. అధికారులు తమ ఉద్యోగం, పిల్లల సంఖ్య, చట్టపరమైన సమస్యలు తలెత్తితే ప్రయాణ ఖర్చులను ఎలా భరిస్తారు, అమెరికాలో ఎన్ని రోజులు ఉంటారు వంటి ప్రశ్నలు అడిగారని ఆమె వివరించారు. అగ్యిలార్ కుమారుడు 22 ఏళ్ల క్రితం గ్వాటెమాల నుంచి అమెరికాకు వలస వచ్చారు. అప్పటి నుండి అగ్యిలార్ దంపతులు అమెరికాకు రాలేదు, ఇప్పుడు తమ కుమారుడిని చూడడానికి వచ్చారు. తమ విమానం ల్యాండ్ అయిన తర్వాత గంటసేపటి వరకు తాము అక్కడే ఉన్నామని అగ్యిలార్ తెలిపారు. గ్వాటెమాల ట్రంప్ కొత్తగా విధించిన నిషేధిత దేశాల జాబితాలో లేదు. అయినప్పటికీ, ఈ దంపతులు ఎదుర్కొన్న అనుభవం, నిషేధిత దేశాల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి వస్తున్న ప్రయాణికులను కూడా అధికారులు మరింత క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని స్పష్టం చేస్తుంది.

**-నిషేధిత దేశాల జాబితా:** గత వారం ట్రంప్ విధించిన నిషేధిత దేశాల జాబితాలో ఆఫ్ఘనిస్థాన్, మయన్మార్, చాద్, ది రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, ఇరాన్, లిబియా, సోమాలియా, సుడాన్, యెమెన్ ఉన్నాయి. వీటితో పాటు, బురుండి, క్యూబా, లావోస్, సియెర్రా లియోన్, టోగో, తుర్క్మెనిస్థాన్, వెనిజులా ప్రజలపై ఉన్న ఆంక్షలు పెరిగాయి. అమెరికాలో అక్రమ వలసదారుల అరెస్టులతో లాస్ ఏంజెలెస్ నగరంలో ప్రజలు పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్న సమయంలోనే ఈ ట్రావెల్ బ్యాన్ కూడా అమల్లోకి రావడం గమనార్హం. ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్న 2017లో విధించిన ట్రావెల్ బ్యాన్ సమయంలో విమానాశ్రయాల్లో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అయితే, ప్రస్తుతం అంతగా సమస్యలు లేకుండానే ఈ ట్రావెల్ బ్యాన్ అమలవుతున్నప్పటికీ, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు మాత్రం కొనసాగుతున్నాయి.

## చనిపోయాక ఏం జరిగిందంటే? చచ్చి బతికిన మహిళ వెల్లడి

పుట్టుక, ఎదుగుదల, వృద్ధాప్యం, చివరికి మరణం. ఇవి జీవిత చక్రంలో సహజంగా జరిగే పరిణామాలు. ఒక మనిషి తల్లి గర్భం నుంచి పుట్టిన తర్వాత శరీరంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటాయి. అయితే, వృద్ధాప్యం తర్వాత మరణం సంభవించినప్పుడు ఏమి జరుగుతుంది అనే ప్రశ్న ఎప్పటి నుంచో మానవాళిని వెంటాడుతోంది. సినిమాలు, కల్పిత సాహిత్యంలో ఎన్నో ఊహాత్మక విషయాలు చెప్పినప్పటికీ, వాటికి శాస్త్రీయ ఆధారం లేదు. మరణానంతర జీవితం గురించి తెలుసుకోవడానికి శాస్త్రవేత్తలు లోతుగా పరిశోధనలు చేస్తున్నప్పటికీ మరణానికి దగ్గరగా వెళ్లి ఆ అనుభవాలను తెలుసుకోవడం కష్టమని వారు అంగీకరించారు. ఈ నేపథ్యంలో అమెరికాలోని కొలరాడో ప్రాంతానికి చెందిన 33 ఏళ్ల బ్రయానా లాఫర్జీ అనే మహిళ తన వినూత్న అనుభవంతో సంచలనం సృష్టించారు. ఇటీవల ఆమె 8 నిమిషాల పాటు క్లినికల్ మరణాన్ని చవిచూసి, ఆ తర్వాత తన అనుభవాలను వెల్లడించారు. ఆమె చెప్పిన విషయాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయి. బ్రయానా లాఫర్జీ అనుభవం అందరినీ ఆశ్చర్యపరిచింది.. "శరీరానికి చావుంది, ఆత్మకు లేదు" అని తెలిపింది. బ్రయానా లాఫర్జీ మైక్లోనస్ డైస్టోనియా అనే ప్రాణాంతక మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవలే ఆమె 8 నిమిషాల పాటు క్లినికల్ మరణాన్ని అనుభవించినప్పుడు జరిగిన పరిణామాలను బయటపెట్టారు. ఆమె



మాటల్లో "నేను కన్ను మూసిన తర్వాత మొత్తం చీకటిగా కనిపించింది. కొంత సమయం తర్వాత నేను ఇంకో లోకంలోకి వెళ్ళిపోయాను. వైద్యులు నన్ను వైద్యపరంగా చనిపోయినట్లు ప్రకటించారని నాకు అర్థమైంది, కానీ నేను మాత్రం స్పృహలోకి వచ్చినట్లు అనిపించింది. నా శరీరం నుండి భౌతికంగా వేరు చేయబడినట్లు భావన కలిగింది. నేను అప్పటికే బతికే ఉన్నాననే అనుభూతి నాకు దక్కింది. కన్నుమూసేటప్పుడు నాకు ఎటువంటి నొప్పి, బాధ కలగలేదు. కేవలం మనశ్శాంతి మాత్రమే మెండుగా దక్కింది." అని ఆమె పేర్కొంది. "శరీరం నుంచి వేరుపడిన తర్వాత నా ఆత్మ దేహం నుంచి అలా ఎగురుకుంటూ వెళ్లిపోయింది. అక్కడ మనుషులు లేరు, కాకపోతే వేరే రకమైన జీవులు ఉన్నాయి. అక్కడ సమయం ఎలా ఉంటుందో తెలియదు గానీ, ప్రతిదీ సందర్భం ప్రకారం జరుగుతోంది. మనుషులుగా మనం కేవలం తాత్కాలికం మాత్రమే. మరణం తర్వాత మనిషి ఆలోచన సరళి పూర్తిగా మారిపోతుంది." అని పేర్కొంది.

**క్లినికల్ మరణం తర్వాత బ్రయానా ఎదుర్కొన్న సమస్యలు...** బ్రయానా లాఫర్జీ ఈ లోకానికి తిరిగి వచ్చిన తర్వాత అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. నడవడంలో తడబడటం, మాట్లాడటంలో ఇబ్బంది పడటం వంటి సమస్యలు తలెత్తాయి. పిట్యూటరీ గ్రంథిలో కూడా ఆమె సమస్యను ఎదుర్కొన్నారు. చివరికి ఆమె మెదడుకు సంబంధించిన శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. బ్రయానా లాఫర్జీ అనుభవం మరణం తర్వాత ఏమి జరుగుతుందనే దానిపై కొత్త చర్చకు దారితీసింది. ఆమె చెప్పిన విషయాలు శాస్త్రీయంగా నిరూపించబడనప్పటికీ, మరణానంతర అనుభవాలపై ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

## సినిమా 'షో'

## కళావతి కసెక్కించే పెర్ఫార్మెన్స్ ఇస్తోందా!

బాలీవుడ్ వెబ్ సిరీస్ 'అక్క'తో కీర్తి సురేష్ ఎంట్రీ ఇస్తోన్న సంగతి తెలిసిందే. తిరుగుబాటు దారుల కుట్రలను తిప్పికొట్టే రివేంజ్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతోన్న సిరీస్ ఇది. ఇదే సిరీస్ తో ధర్మరాజ్ శెట్టి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. యశ్ రాజ్ ఫిలింస్ ఈ సిరీస్ ను ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుంది. ఇందులో రాధిక ఆప్టే మరో కథానాయికగా నటిస్తుంది. అంటే రాధికతో కీర్తి సురేష్ పోటీ పడి నటించాల్సిన పరిస్థితి ఇది. ప్రస్తుతం సెట్స్ లో ఉన్న సిరీస్ గురించి మరిన్ని విషయాలు లీక్ అయ్యాయి. ఇందులో కీర్తి సురేష్ మాఫియా లేడీ డాన్ పాత్ర పోషిస్తుంది. కంటెట్ కాస్త బోల్డ్ గాను ఉంటుందని తొలి నుంచి ప్రచారంలో ఉంది. అలాంటి పెర్ఫార్మెన్స్ విషయంలో రాధికా ఆప్టే ఎక్కడా తగ్గదు. బోల్డ్ సన్నివేశాల ఎలివేషన్ పరంగా తనదైన మార్క్ వేస్తుంది. అలాగని కీర్తి సురేష్ కూడా ఎక్కడా



తగ్గలేదు. తొలుత రాధికతో పోటీ పడగలదా? అన్న సందేహం వ్యక్తమంది. కానీ ఆన్ సెట్స్ లో కీర్తి సురేష్ బోల్డ్ అప్పిరియన్స్ తో ఆకట్టుకుంటుందని నెట్ ఫ్లిక్స్ వర్గాల నుంచి లీకైంది. రొమాంటిక్ సన్నివేశాల్లో కీర్తి ఎక్కడా రాజీ లేకుండా నటిస్తుందిట. తెరపై ఆ సన్నివేశాలు సరికొత్త అనుభూతి పంచుతాయంటున్నారు. రాధికా ఆప్టే బోల్డ్ అప్పిరియన్స్ గురించి అందిరికీ తెలుసు. కానీ కీర్తి సురేష్ మాత్రం సినిమాల కోసమే అంత లిబర్టీ తీసుకోలేదు. అక్క సిరీస్ కోసం మాత్రం ఎక్కడా ఆలోచిం చకుండా నటిస్తుంది. బాలీవుడ్ లో స్ట్రాంగ్ కెరీర్ ని బిల్డ్ చేసుకునే ప్రక్రియలో భాగంగా రాజీ పడటం లేదు. పోటీని ఎదుర్కుని నిలబడాలంటే ఆ మాత్రం అప్పిరి యన్స్ తప్పనిసరిగా భావించి ముందుకెళ్తున్నట్లు కనిపిస్తుంది. మొత్తానికి 'అక్క' సిరీస్ లో సరికొత్త కీర్తిని చూడటం ఖాయమే.

## జాన్వీకపూర్ తో రామ్ చరణ్ లిప్ లాక్!



గురువులను బట్టే శిష్యులు తయారవుతారు. అందుకే ఎప్పటికైనా శిష్యుడు గురువునే మించిపోతాడంటారు. సుకుమార్-బుచ్చిబాబుల గురు శిష్యులను చూస్తుంటే ఇది నిజమయ్యేలా ఉంది. రొమాంటిక్ సన్నివేశాల విషయంలో సుకుమార్ ఎలివేషన్ ఎలా ఉంటుందన్నది చెప్పాల్సిన పనిలేదు. ఆ విషయంలో సుకుమార్ ఎక్కడా రాజీ పడడు.

'100 పర్సంట్ లవ్' లో తమన్నాని ఎంత అందంగా చూపించాడో? ఇప్పటికీ ఆ సన్నివేశాలు కళ్ల ముందు ఆడుతూనే ఉంటాయి. అటుపై 'ఆర్య 2'లో బన్నీ-కాజల్ అగర్వాల్ మధ్య పెదవి ముద్దుల యుద్ధం తెలిసిందే. రీసెంట్ గా 'పుష్ప' లో బన్నీ -రష్మికా మందన్నా మధ్య రొమాంటిక్ సన్నివేశాల గురించైతే చెప్పాల్సిన పనిలేదు. ఫీలింగ్స్ పాటే గానీ...ఫీలింగ్స్ వస్తున్నాయి సామీ అనే డైలాగ్ గానీ..కిడ్నాపింగ్ కారులో కిరికిరి సీన్ గానీ అన్నీ సుకుమార్ క్రియేటివిటీ నుంచి జాలువారినవే. అలాంటి గురువు వద్ద శిష్యరికం చేసిన బుచ్చిబాబు తన ట్యాలెంట్ ఏంటి? అన్నది తొలి సినిమా 'ఉప్పెన'తోనే చూపించాడు. సముద్రం మధ్యలో జలజల పాటలో హీరో-హీరోయిన్ రొమాన్స్ పీక్స్ లో ఉంటుంది. అంతకు ముందు పరిచయ సన్నివేశాలు అంతే హైలైట్ అవుతాయి. అలా బుచ్చిబాబు కూడా తాను రొమాంటిక్ మేకర్ అని నిరూపించుకున్నాడు. అలాంటి బుచ్చిబాబు 'పెద్ది' విషయంలో కూడా ఆ ఛాన్స్ తీసుకున్నాడా? అంటే అవుననే తెలుస్తోంది. రామ్ చరణ్ -జాన్వీ కపూర్ జంటగా ఈ చిత్రాన్నితెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులోనూ ఘాటైన సన్నివేశాలకు ఏమాత్రం కొదవలేదుట. రామ్ చరణ్-జాన్వీ మధ్య కొన్ని ఇంటిమేట్ సీన్స్ ఉన్నాయంటున్నారు.

అలాగే ఓ స్ట్రాంగ్ లిపికిస్ కూడా సీన్ డిమాండ్ చేయడంతో తొలి షెడ్యూల్ లోనే చిత్రీకరించినట్లు తెలిసింది. ఇంత వరకూ ఈ విషయం బయటకు రాలేదు. జాన్వీ కి కూడా టాలీవుడ్ హీరోతో లిప్ కిస్ అనుభవం ఇదే తొలిసారి. దేవరలో ఎన్టీఆర్ తో నటించింది. కానీ కొరటాల శివ రొమాంటిక్ డైరెక్టర్ కాకపోవడంతో ఆ ఛాన్స్ లేకుండా పోయింది. ఇప్పుడా ఆ లెక్కలన్నీ పెద్దితో బుచ్చిబాబు సరి చేస్తున్నాడు.

## మళ్లీ మాజీల నుంచి శ్రుతిహాసన్ కి సందేశాలా!

శ్రుతిహాసన్ ఇప్పుడు సింగిల్. బోయ్ ఫ్రెండ్స్ కి దూరంగా ఉంటూ సోలో లైఫ్ ని లీడ్ చేస్తోంది. తొలుత మైఖెల్ కోర్సేలోతో సహజీవనం..అటుపై శంతను హజారికాతో బాండింగ్ వ్యవహారం తెలిసిందే. ఆ రెండు బ్రేకప్ ల నుంచి చాలా అనుభవాలు నేర్చుకుంది. అలాగని ప్రేమకు పెళ్లికి పూర్తిగా దూరం ఉంటుందని కాదు. మళ్లీ తప్పకుండా లవ్ లో పడతానని హింట్ ఇవ్వనే ఇచ్చింది. మరి ఇప్పుడా ఇద్దరు మళ్లీ మెసెజ్ లతో టచ్ లోకి వస్తున్నారా? అంటే అవుననే తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్తే డాడ్ కమల్ హాసన్ నటించిన థగ్ లైఫ్‌లో శ్రుతి హాసన్ గాయనిగా పాటలు పాడిన సంగతి తెలి సిందే. ఈనాడు సినిమా తర్వాత థగ్ లైఫ్ సినిమాలో శ్రుతి హాసన్ పాట పాడటం ఇదే. విన్ వెలి నాయకా అంటూ అమ్మడు ఆలపిం చింది. ప్రీరిలీజ్ ఈవెంట్ లో లైవ్ పెర్ఫార్మెన్స్ కూడా ఇచ్చింది. అప్పటి



నుంచి శ్రుతిహాసన్ ఫోన్ ఇన్ బాక్స్...వాట్సాప్ మెసెజ్ లతో నిండిపోయిందిట. ఇప్పటికీ మెసెజ్ లు వస్తూనే ఉన్నాయంది. తన పనితనాన్ని మెచ్చుకుంటూ వస్తోన్న సందేశాలు తనకెంతో సంతోషాన్ని అంది స్తున్నాయంది.

తనని ఇష్టపడే వాళ్లతో పాటు ఇష్టపడని వాళ్ల నుంచి కూడా మెసేజ్ లు వస్తున్నాయంది. దీంతో ఆ మెసెజ్ లు పంపిన వారిలో మాజీ ప్రేమికులు ఉన్నారంటూ సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఓ నెటి జనుడు నేరుగా శ్రుతి హాసన్ ని ఈ విషయం అడిగేసాడు. కానీ శ్రుతి హాసన్ నుంచి మాత్రం ఎలాంటి రిప్లై రాలేదు. మౌనం అర్ధాంగీకారం అంటారు. మరి నిజామా? కాదా? అన్నది శ్రుతి ధృవీకరించాలి. ప్రస్తు తం శ్రుతి హాసన్ కూలీలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో అమ్మడు ఓ కీలక పాత్ర పోషిస్తుంది. ఇంకా కొన్ని సినిమాలు ఆన్ సెట్స్ లో ఉన్నాయి.

Name of Premises : Venus Enclave, Block - 0, Quthbullapur City, Medchal Malkajgiri District - 500055, email : sanjeevreddyetlapuram@gmail.com. Cell : 8985829417